క్లుప్తంగా

చేతిపంపు ప్రారంభం



చిన్నంబావి: మండలంలోని అయ్యవారిపల్లిలో తాగునీటి సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి గ్రామస్తులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి గ్రామంలో నూతనంగా చేతిపంపులను ఏర్పాటు చేశారు. గ్రామంలో సమస్య ఉందని అడిగిన వెంటనే తాగునీటి సమస్యకు పరిష్కారం చూపినందుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతయ్య, బీరయ్య, కృష్ణయ్య, విభీషణ్, మల్లయ్య, రామకృష్ణ, గోపాల్, తిరుపతయ్య, మురళీ, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరం



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతమయింది. వైద్య పరీక్షల కోసం 46 మంది రాగా వారిలో 37 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లినట్లు వైద్యాధికారి రాజశేఖర్, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మురళీ తెలిపారు. కంటి ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

కూలిన మట్టి మిద్దె: తప్పిన ప్రమాదం



వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో బుధవారం సాయంత్రం ముంత కుర్మయ్యకు చెందిన మట్టి మిద్దె అకస్మాత్తుగా కూలి నేలమట్టం అయ్యింది. అతడు భార్య కృష్ణమ్మతో కలిసి ఇంటి ఆరుబయట ఉన్న సమయంలో మట్టి మిద్దె కూలడంతో పెను ప్రమాదం తప్పింది. ఎలాంటి జీవనాధారం లేని నిరుపేద కుటుంబానికి చెందిన వీరి మిద్దె కూలిపోవడంతో వీధిన పడ్డారని, అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరిపి బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉపాధి పనుల పరిశీలన



చిన్నంబావి: మండలంలోని పెద్దమారు, పెద్దదగడ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ రమణరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన ఉపాధి కూలీల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. కొన్ని రోజులు వాతావరణం చల్లబడినా.. తిరిగి ఎండల వేడి పెరుగుతున్నందున పని ప్రదేశంలో కూలీలు సేద తీరేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. కొలతల ప్రకారం పని వివరాలను పక్కాగా రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

మోడల్ స్కూల్ ఉపాధ్యాయుడి ప్రతిభ



కొత్తకోట రూరల్: తెలంగాణ రాష్ట్ర సారస్వత పరిషత్ రాష్ట్రస్థాయి బాల సాహిత్య సమ్మేళనాన్ని ఈ నెల 29, 30 తేదీల్లో హైదరాబాద్ అబిడ్స్‌లోని దేవులపల్లి రామనుజన్‌రావు కళా మందిరంలో నిర్వహించింది. 'ఆరోగ్యం–విజ్ఞానం' అనే బాలల సైన్స్ గ్రంథాన్ని పద్మభూషణ్ డా. వరప్రసాద్‌రెడ్డి, సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, రమణాచారి, జుర్రు చెన్నయ్య ఆవిష్కరించారు. ఈ గ్రంథంలో మండలంలోని అమడబాకుల మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు తూర్పింటి నరేష్‌కుమార్ రాసిన సైన్స్ వ్యాసాలు ప్రచురించారు. అదేవిధంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి ఆహ్వానించిన బాలసాహితీవేత్తలతో 'బడిలో తెలుగు భాష' అనే సదస్సులో నరేష్ కుమార్ వక్తగా పాల్గొని మాట్లాడారు. తెలుగు బోధనలో ఎదురవుతున్న ఇబ్బందులు.. సవాళ్లు.. సమస్యలు.. పరిష్కారాలు అనే అంశంపై 15 నిమిషాల పాటు మాట్లాడారు. ఈ సందర్భంగా నరేష్‌కుమార్‌ను వనపర్తి సాహితీవేత్తలు జనజ్వాల, నారాయణరెడ్డి, నాయకంటి నర్సింహశర్మ, బైరోజు చంద్రశేఖర్, తిరుమలేష్, సత్తార్, శివలింగం తదితరులు అభినందించారు.

గాడి తప్పిన గ్రామపాలన

- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- సమస్యల పరిష్కారానికి రోజుల పాటు ఎదురుచూపులు



ఏదుట్లలో తాగునీటి ట్యాంకు పెచ్చులూడి చువ్వలు తేలిన దృశ్యం (ఫైల్)



గోపాల్‌పేట రేకులగడ్డ కాలనీలో తాగునీటి పైప్‌లైన్ పనులు చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది (ఫైల్)

గోపాల్‌పేట: అధికారుల పాలనలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రజాప్రతినిధుల పాలన ముగిసి ఇప్పటికే మూడు నెలలు గడిచిపోయింది. ఇంకా కొన్ని నెలల పాటు స్థానిక సంస్థలు ఎన్నికలు జరిగే పరిస్థితులు లేకపోవడంతో అధికారుల పాలనే కొనసాగే అవకాశం కనిపిస్తోంది. గ్రామాల్లో ప్రజలకు అందాల్సిన కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో అధికారులపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో మొత్తం 27 గ్రామ పంచాయతీలు ఉండగా.. వీటిలో బండరావిపాకుల, కొండలపల్లి గ్రామాలు మునకకు గురికావడంతో ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లలో పనులు కొనసాగుతున్నాయి. మిగతా 25 గ్రామాల్లో తాగునీరు రెండు రోజుకోసారి వస్తుంది. గ్రామాల్లో వీధిలైట్లు చాలా వరకు వెలగడం లేదు. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇదీ పరిస్థితి

- గోపాల్‌పేట మండల కేంద్రంలోని రాంగన్‌కాలనీలో రెండు నెలలకు పైగా మిషన్ భగీరథ నీరు రావడం లేదు. ఇదే కాలనీలో ముప్పైకి పైగా వీధి లైట్లు వెలగడం లేదు. దీనిపై అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు చెబుతున్నారు.
- ఏదుట్లలోని మఠం కాలనీలో తాగునీటి ట్యాంకు పైకప్పు కూలిపోయి చీకులు తేలాయి. ఎప్పుడు ట్యాంకు కూలిపోతుందోనని సమీప ఇళ్లలో నివసించే వారు భయాందోళనకు గురవుతున్నారు.
- చెన్నారంలో వీధిలైట్లు వెలగటం లేదని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు తెలిపారు.
- రేవల్లి మండలంలోని పలు గ్రామాల్లో సైతం సమస్యలు ఉన్నాయని అధికారులకు విన్నవించినా పట్టించుకునే నాథుడు లేకుండా పోయారని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరెంట్ కోతలతో అవస్థలు

గోపాల్‌పేట సబ్‌స్టేషన్ నుంచి మండల కేంద్రంతో పాటు కొన్ని గ్రామాలకు కరెంటు సరఫరా అవుతోంది. నెల రోజుల నుంచి చిన్నపాటి గాలి, వర్షం కురిసినా కరెంటు పోతోందని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ సంబంధిత అధికారులు కరెంటు పోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

లైట్లు వేయడం లేదు



మా కాలనీలో నెల రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. ఎన్నిసార్లు అధికారులను అడిగినా స్పందించట్లేదు. రేపు, ఎల్లుండి అని కాలయాపన చేస్తున్నారే తప్పా లైట్లు బిగించట్లేదు. రాత్రి అయితే చీకటిగా ఉండడంతో ఇళ్లలోకి విషసర్పాలు వస్తాయని ఆందోళనతో ఉంటున్నాం. అధికారులు ఇప్పటికైనా చొరవ తీసుకుని లైట్లు వేయించాలి.

– కోడిగంటి నరసింహ, రాంనగర్ కాలనీ, గోపాల్‌పేట

మరమ్మతు అవసరం



ఏదుట్ల గ్రామంలోకి మఠం కాలనీలో చాలా సమస్యలు ఉన్నాయి. వాటర్ ట్యాంకు పైకప్పు నీళ్లలోనే కూలిపోయింది. దాన్ని బాగు చేయించాలని అధికారులకు చెప్పాం. కానీ ఎవరూ స్పందించడం లేదు. అలాగే కాలనీలో డ్రెయినేజీ పైన ఉండే సీసీ పడిపోతుంది. మరమ్మతు చేయాలని కోరినా అధికారుల నుంచి స్పందన లేదు.

– రాజేష్‌వారి, ఏదుట్ల

సమస్యలు పరిష్కరిస్తాం

క్షేత్ర స్థాయిలో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటిని వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో తాగునీటి సమస్య అధిగమించేందుకు ఏర్పాట్లు చేశాం.

– శేఖర్, ఎంపీడీఓ, గోపాల్‌పేట

ఆశ్రమ పాఠశాలపై అధికారులు దృష్టి సారించాలి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని బంజార గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు శివనాయక్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఖిల్లాఘనపురం ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవడంతో పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు నాణ్యమైన విద్యకు నోచుకోలేదన్నారు. ఈ విషయాలను జిల్లా అధికారులైన డీటీడీఓ, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లిన చర్యలు తీసుకోకపోవడం బాధగా ఉందన్నారు. ఉపాధ్యాయుల మధ్య సఖ్యత లేకపోవడం వలన విద్యార్థులు కూడా గ్రూపులుగా విడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు పాఠశాలలో జరుగుతున్న పరిస్థితులపై విచారణ చేపట్టి ఉపాధ్యాయులను లేదా పాఠశాల హెచ్‌ఎం ను మార్చాలని కోరారు. లేకుంటే అందరిని పాఠశాల నుంచి బదిలీ చేసి కొత్త వారిని తీసుకురావాలని ఆయన కోరారు.

ఆకతాయిలతో జాగ్రత్త

రాజోళి: బాలికలను ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తుంటారని, అలాంటి వారితో అప్రమత్తంగా ఉండాలని ఎంవీ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి హనిమిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో కిషోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీఓ ఖాజా మొయినొద్దీన్, కానిస్టేబుల్ రామాంజనేయులు మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ను ఏవిధంగా కనిపెట్టాలి, వారి ప్రవర్తన ఎలా ఉంటుందనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. వారు అల్లరి చేసే సమయంలో ఎలా ప్రతిఘటించాలో వివరించారు.

ఆలయ పరిసరాల్లో తొలగని వ్యర్థాలు



ఆలయ పరిసరాల్లో కోళ్ల వ్యర్థాలు

అమరచింత: పట్టణంలోని సవారమ్మ ఆలయం ఆవరణలోని కోళ్ల వ్యర్థాలు తొలగించకపోవడంతో ఆలయ పరిసరాలు దుర్గంధంగా తయారయ్యింది. మంగళవారం సవారమ్మ జాతర సందర్భంగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకుని కోళ్లను బలిచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాల్లోనే కోళ్ల వ్యర్థాలను పారవేయడంతో పరిసరాలంతా కోడి ఈకలు, రక్తపు మరకలతో నిండుకున్నాయి. దీంతో కుక్కలు సైతం అక్కడే ఉంటూ కోళ్ల వ్యర్థాలను తింటూ ప్రధాన రహదారిపై ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనదారులపై ఎగబడుతున్నాయి. మున్సిపాలిటీ అధికారులు ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించకపోవడంతోనే ఆలయ పరిసరం అధ్వానంగా తయారైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించి ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కోరుతున్నారు.

హరిత మొక్కలకు గుంతలు సిద్ధం చేయండి



మామిడిమాడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటాచారి

ఖిల్లాఘనపురం: మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో రోడ్ల వెంట మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ వెంకటాచారి తెలిపారు. బుధవారం మండలంలోని వెనికితండా, మామిడిమాడ గ్రామాల్లో పర్యటించిన ఆయన ఉపాధి పనులు, ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు పరిశీలించారు. ఉపాధి సిబ్బంది, కూలీలతో మాట్లాడి అక్కడి సమస్యలు పనుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమీపిస్తున్నందున అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వడం, పాటుకాల్వలు, చెరువు కాల్వల్లో గడ్డి, పిచ్చి మొక్కలు తొలిగించడం లాంటి పనులు చేపట్టాలని తెలిపారు. గుంతలు సిద్ధం చేయడం వలన వర్షాలు కురిసిన వెంటనే మొక్కలు నాటేందుకు ఉపయోగంగా ఉంటుందన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పెంట్లవెల్లి: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని డీఆర్‌డీఓ చిన్నోబులేష్ అన్నారు. బుధవారం మండలంలోని మాధవస్వామినగర్‌లో పల్లెప్రకృతి వనాన్ని, నర్సరీని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. నిర్వాహకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా పల్లెప్రకృతి వనాన్ని పరిశీలించారు. మొక్కలు ఎండకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీ శ్రావణ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసన్నకుమారి, ఏపీఓ మోహన్‌కృష్ణ, రాము, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిపై అసత్య ఆరోపణలు సరికాదు'

పెంట్లవెల్లి: చిన్నంబావి మండలం లక్ష్మీపల్లిలో శ్రీధర్‌రెడ్డిని గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేస్తే బీఆర్‌ఎస్ నాయకులు స్థానిక మంత్రి జూపల్లి కృష్ణారావుపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మదుగం నర్సింహయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి జూపల్లిని రాజకీయంగా ఎదుర్కోలేక మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హత్యారాజకీయాలకు తెరలేపారని విమర్శించారు. శ్రీధర్‌రెడ్డి హత్యకేసులో మంత్రి ప్రమేయం లేకున్నా రాజకీయదురుద్దేశ్యంతోనే ఆరోపణలు చేస్తున్నారన్నారు. తప్పుడు ప్రచారాలు మానుకోకపోతే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్, రామన్‌గౌడ్, నర్సింహనాయుడు, తిరిగిరి గోపాల్, శంకర్, కబీర్, ఎర్రశీను, ఆంజనేయులు, శేషాంద్రప్రసాద్, హుసేన్, నాగిరెడ్డి, వెంకట్, కుర్మయ్య, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 8వ వార్డుకు చెందిన రేగు బాలస్వామిబుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. స్థానిక కౌన్సిలర్ విభూతి నారాయణ ఎమ్మెల్యే మేఘారెడ్డికి సమాచారం ఇవ్వగా బాధిత కుటుంబానికి రూ.ఐదు వేల ఆర్థికసాయాన్ని పంపించారు. ఎమ్మెల్యే సూచన మేరకు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, మాజీ జెడ్పీటీసీ వెంకటయ్య యాదవ్, నాయకుడు లక్కాకుల సతీష్ మృతదేహానికి నివాళులర్పించి, నగదును బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో ఉమ్మల రాములు, బాలస్వామి, నరసింహ, శివ, సురేష్, గోపాల్, శాంతన్న, తిరుపతి, వినయ్, రాములు, రేగు శాంతన్న, రేగు సాయిలు, మధు, శశాంక్ తదితరులు ఉన్నారు.

మహిళ అదృశ్యం



పద్మమ్మ (ఫైల్)

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ పద్మమ్మ ఆదివారం సాయంత్రం నుంచి కనబడట్లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ నాగమల్లయ్య, పద్మమ్మ దంపతులు. పద్మమ్మ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిందని కుమారుడు శివ తెలిపాడు. అప్పటి నుంచి ఆమె తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పద్మమ్మ ఆచూకీ తెలిస్తే 84669 36959 నెంబరుకు సమాచారం అందించాలని కోరారు.

పరామర్శ

మానవపాడు: ఎర్రవల్లి మండలంలోని వల్లూరు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో మరణించారు. బుధవారం అలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట వెంకట్‌రాంరెడ్డి, గిడ్డారెడ్డి, రవిప్రకాశ్, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, ధర్మారెడ్డి, నరసింహారెడ్డి, గిరిధర్‌రెడ్డి, నాగేష్ ఉన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి వసతుల కల్పన

- పనుల్లో నాణ్యత పాటించాలి
- కలెక్టర్ తేజస్ పవార్



దావాజిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తేజస్ పవార్

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపడుపతున్న మౌలిక వసతుల కల్పన పనులు బడులు తెరిచే నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ తేజస్ పవర్ కోరారు. బుధవారం మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి, రాయినిపల్లిలోని పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, వంటగది నిర్మాణాలు, విద్యుద్దీకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతు పనులను మండల స్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షించాలని.. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. దావాజిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులు, గుడ్లు, పాలు తదితర సరుకుల నిల్వలను పరిశీలించారు. చిన్నారులకు అందించే పౌష్టికాహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతనే పంపిణీ చేయాలని సూచించారు. గ్రామంలోని పారిశుద్ధ్య కార్మికులకు వేతనాలు సక్రమంగా అందడం లేదనే విషయం కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. డీపీఓతో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ వేతనాలను త్వరగా అందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన ఇద్దరు చిన్నారులకు నోటు పుస్తకాలు అందించి బాగా చదువుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయి, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్, డీటీ అశోక్‌నాయుడు, ఏపీఓ కుర్మయ్య, ఏఈ కవిరెడ్డి, ఏఈఓ నరేష్, మాజీ సర్పంచ్ వెంకటయ్యయాదవ్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, అమ్మ ఆదర్శ కమిటీల చైర్మన్లు ఉన్నారు.

సమాజానికి వారధిగా ఉండాలి



ఉపాధ్యాయులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మదనాపురం: ప్రతి ఒక్కరూ సమాజ శ్రేయస్సులో భాగస్వాములవ్వాలని రిటైర్డ్ హెచ్‌ఎం కురుమయ్య అన్నారు. దుప్పల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో 1994–95 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు నాడు పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ వృత్తిలో స్థిరపడ్డ అంశాలను వివరించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఎవరూ అధైర్య పడకుండా చేపడుతున్న పనిని నమ్మకంగా కొనసాగిస్తూ మంచి స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. నాడు పాఠశాలలో చదువుకొని కలిసి ఉన్నట్టుగానే ఎప్పటికీ ఉండాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గురువులు కురుమయ్య, బెల్లం సాయిలు, తిర్మలయ్యచారి, యూసుఫ్, చింతలయ్యను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

వేసవి అలవెన్స్‌ల కోసం ఉద్యమిద్దాం

వీపనగండ్ల: ఉపాధి కూలీలకు వేసవి అలవెన్స్‌ను చెల్లించాలని ఎన్నో రోజులుగా విజ్ఞప్తి చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, సమైక్య పోరాటాల ద్వారానే ఉపాధి కూలీల హక్కులు సాధించొచ్చని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు అన్నారు. బుధవా రం తూంకుంట, బొల్లారం గ్రామాల్లో ఉపాధి కూలీలతో కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నా రు. తీవ్రమైన ఎండల్లో పనిచేస్తున్న కూలీలకు నీడ వసతులు, పనిముట్లకు అవసరమైన పారితోషికం అందివ్వాలని విజ్ఞప్తి చేసిన అధికారులు స్పందించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలకు అనుగుణంగా గిట్టుబాటు అయ్యే కూలీలు చెల్లించాలని కోరుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవట్లేదని వాపోయారు. జిల్లాలోని ఉపాధి కూలీల సమస్యల పరిష్కారం కోసం జూన్ 6వ తేదీన కలెక్టర్ కార్యాలయం ఎదుట వందలాది ఉపాధి కూలీల ఆధ్వర్యంలో ధర్నా చేపడతామన్నారు. జిల్లాలోని ఉపాధి కూలీలంతా పాల్గొని తమ గొంతు వినిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింహాగౌడ్, రజిత, బాలగౌడ్, శిల్ప, ఈశ్వరయ్య, రాముడు, బాలపీర్, బాలమ్మ, చిట్టెమ్మ, సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడి



చంద్రగఢ్‌లో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ రాజేష్

ఆత్మకూర్: రైతులు అధిక దిగుబడులు సాధించాలని నకిలీ విత్తనాలను కొనుగోలు చేసుకుని మోసపోవద్దని మండల వ్యవసాయశాఖ సహాయ అధికారి సింధూజ అన్నారు. బుధవారం మండలంలోని ఆరేపల్లి, తిప్పుడంపల్లి గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడుల కోసం నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వ లైసెన్స్ పొంది అర్హత ఉన్న డీలర్ల వద్దనే విత్తనాలను కొనుగోలు చేయాలని తప్పనిసరిగా రశీదును పొందాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారులు ప్రతినిత్యం అందుబాటులో ఉంటారని రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు.

పాన్‌గల్: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ నరేష్ అన్నారు. బుధవారం మండలంలోని మాందాపూర్‌లో నిర్వహించిన రైతులకు, వ్యవసాయ కూలీలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం పొలం దున్నేటప్పుడు వరి కొయ్యలను కాల్చివేయకుండా కలియదున్నాలని సూచించారు. రైతులు ఖరీఫ్ సీజన్‌లో నాణ్యమైన, మేలు రకం విత్తనాలను కొనుగోలు చేసి పంటలను సాగు చేయాలన్నారు. విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తప్పని సరిగా రశీదు తీసుకోవాలన్నారు. అన్నారం, బండపల్లి, కేతేపల్లి, తెల్లరాళ్లపల్లి, కొత్తపేట తదితర గ్రామాల్లో నిర్వహించిన రైతు సదస్సుల్లో ఆయా గ్రామాల ఏఈఓలు పాల్గొని రైతులకు ఖరీఫ్ సాగు విధానం, విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు నరేష్, శైలజ, మహేశ్వరి, అఖిల, నరేష్, రైతులు పాల్గొన్నారు.

అమరచింత: వానాకాలం పంటల సాగు వ్యవహారంలో రైతులు విత్తనాల కొనుగోలు వ్యవహారంలో వ్యవసాయ అధికారుల సూచనలు పాటించి పంటను సాగు చేస్తే ఆశించిన దిగుబడి సాధ్యమని ఏఈఓలు రాజేష్, మల్లేష్ తెలిపారు. మండలంలోని పాంరెడ్డిపల్లి, చంద్రగఢ్ గ్రామాల్లో వ్యవసాయ సాగు విషయాలపై రైతులకు, రైతు కూలీలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలను నాటే సమయంలో పంట పొలాలను ఎలా దుక్కిదున్నాలి అన్న విషయాలను రైతులకు వివరించారు.




మాందాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న ఏఈఓ నరేష్



ఆరేపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ సింధూజ

రోడ్డు విస్తరణ పనులు పునఃప్రారంభం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలో 8 నెలలుగా నిలిచిపోయిన రోడ్ల విస్తరణ పనులు పునఃప్రారంభమయ్యాయి. ఈ మేరకు పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులను బుధవారం స్థానిక పాత యూకో బ్యాంక్ మూలమలుపు వద్ద జేసీబీతో ప్రారంభించారు. ఈ పనులను కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న రోడ్ల విస్తరణ పనులను త్వరతగతిన పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మేఘారెడ్డి కృతనిశ్చయ్యంతో ఉన్నారని చెప్పారు. గతంలో రోడ్ల విస్తరణ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో ఇన్నాళ్లు అసంపూర్తి విస్తరణ పనుల్లో కదలిక లేకుండా పోయిందని, పెండింగ్‌లో ఉన్న రూ. 25కోట్ల బిల్లులను ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రభుత్వంలో మంజూరు చేయించడంతో కాంట్రాక్టర్లు ఎమ్మెల్యేపై నమ్మకంతో పనులు చేసేందుకు ముందుకొచ్చారని వివరించారు. అసంపూర్తిగా ఉన్న విస్తరణ పనులను పూర్తి చేసి ప్రజారవాణాకు అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో కొందరు నాయకులు రోడ్ల విస్తరణ తాము చేయలేమని చేసిన వితండ వాదనకు మా పనితీరే పొలమానం అని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయచందర్, లక్కాకుల సతీష్, సోషల్ మీడియా అసెంబ్లీ కోఆర్డినేటర్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.